క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కాణిపాకం: నెల్లూరు జిల్లాకు చెందిన నరేందర్ రెడ్డి ఆదివారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి రూ.1,00,116లను విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాత, కుటుంబసభ్యులకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. సిబ్బంది వాసు, విగ్నేష్ పాల్గొన్నారు.

గంగజాతర రేపు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగజాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించిన తరువాత గ్రామ నడివీధిలో కొలువుదీర్చనున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. బుధవారం రాత్రి అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మజూరీ చార్జీలు తగ్గింపు ఆఫర్



ఆఫర్‌ను ప్రారంభిస్తున్న జోయాలుకాస్ ప్రతినిధులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జోయాలుకాస్‌లో ఆదివారం మజూరీ చార్జీలపై 50 శాతం తగ్గింపు ఆఫర్‌ను ప్రారంభించారు. ఆఫర్ బ్రోచర్‌ను కొనుగోలుదారుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మేనేజర్ షనీష్ ఆఫర్ వివరాలను వివరించారు. వారికి బహుమతులను అందజేశారు.

బక్రీద్ శుభాకాంక్షలు

చిత్తూరు కార్పొరేషన్: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, జిల్లాలోని ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ కోరారు. ఆయన ఆదివారం ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ అనురాగాలతో అందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

పూతలపట్టు: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కంటి సమస్యలు ఉన్న రోగులను అదే రోజు మధ్యాహ్నం బస్సులో తీసుకువెళ్లి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్ చేయించి అనంతరం పూతలపట్టుకు తిరిగి తీసుకొస్తామని చెప్పారు. శిబిరానికి వచ్చే రోగులు తమతో పాటు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన ఈవో



మంత్రికి చిత్రపటం అందజేస్తున్న ఈవో, అర్చకులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఈఓ వెంకటేశు ఆదివారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో మంత్రిని కలిసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి



బిల్లేరులో నిర్వహిస్తున్న రామకోటి

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ బిల్లేరు సమీపంలోని శ్రీ రామాలయంలో ఆదివారం రామకోటి గీతాలాపన ప్రారంభించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో రామాలయంలో సీతా రామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం
- పూర్తయిన ఏర్పాట్లు
- ముస్తాబైన మసీదులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా జరుపుకుంటారు. దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ అజహా (బక్రీద్). దీన్నే త్యాగాల పండుగ అని కూడా పిలుస్తారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక గొర్రె, పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర



చిత్తూరులోని ఈద్గా మైదానం వద్ద ఏర్పాటుచేసిన షామియానా

మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్గాకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేస్తారు.

మార్కెట్‌లో సందడి

మార్కెట్‌లో బక్రీద్ సందడి మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు తమిళనాడు నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరి కొందరు తమ సమీప ప్రాంతాల నుంచి కొనుగోలు చేశారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.8 వేల నుంచి రూ.22 వేల వరకూ ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. బక్రీద్ సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొట్టేళ్ల వ్యాపారం జరిగినట్టు అంచనా.

పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తుందంటే పొట్టేళ్లకు గిరాకీ పెరుగుతుంది. ముస్లింలు వారం రోజుల నుంచే కొత్త బట్టలు, పండగ సామగ్రి కొనుగోలు చేస్తారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారు. పండుగ తర్వాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చే అవకాశం ఉంది.

ముస్తాబైన మసీదులు, ఈద్గాలు

చిత్తూరు నగరంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రార్థనకు ముస్లింలు అధిక సంఖ్యలో తరలివస్తారని భావించి ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అలాగే బజారువీధి, శేషాపీరన్‌వీధి, హైరోడ్డు, రాంనగర్ కాలనీ, గంగనపల్లి తదితర ప్రాంతాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈద్గాలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభంకానున్నట్లు మత పెద్దలు తెలిపారు.

ఆంధ్రా విద్యార్థి సంఘం నేతగా అఖిల్



చిత్తూరు కార్పొరేషన్: ఆంధ్రా విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కొంగారెడ్డిపల్లెకు చెందిన అఖిల్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ తురక ప్రసాద్ ఏకగ్రీవంగా ప్రకటించారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన తురకప్రసాద్‌కు అఖిల్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తానన్నారు.

21న పౌర్ణమి అఖండ ధ్యానం

తవణంపల్లె: మండలంలోని విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఈనెల 21న శుక్రవారం పౌర్ణమిరోజు అఖండ ధ్యాన సదస్సు జరుగుతుందని జిల్లా పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకుని రాత్రి 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆధ్యాత్మిక ఆత్మ జ్ఞానసదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం





వేదపండితులచే అంకురార్పణ కార్యక్రమం, స్వామికి పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ ధర్మకర్త

– భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి వేదపండితులచే అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు ఐరాల శంకర్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి తిరుమంజనం చేయించారు. సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం జరిగింది. ఉభయదారులు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి పూజాసామగ్రి, ప్రసాదాలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం ఉభయదారులు ఐరాల వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులచే అంకుర్పాణ కార్యక్రమాన్ని వేదపండితులచే వైభవంగా నిర్వహించారు.

నేడు టి.పుత్తూరులో భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం

టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఉభయదారులచే ధ్వజారోహణం, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రిలో హంస వాహన సేవ ననిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తెలిపారు.



ధర్మపురిలో విశేష అలంకరణలో గంగమ్మ

వైభవంగా గంగజాతర

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల, ధర్మపురి గ్రామాల్లో గంగజాతరను వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. ఇతర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

పడిపోతున్న తోతాపురి ధర

- టన్ను రూ.28 వేల నుంచి రూ.22 వేలకు పడిపోయిన ధర

బంగారుపాళెం: స్థానిక మామిడి మార్కెట్‌లో తోతాపురి (బెంగళూర)రకం మామిడి ధరలు రోజురోజు కు పతనం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్ ప్రారంభంలో తోతాపురి రకం ధర ఆశాజనకంగా ఉండేదన్నారు. టన్ను రూ.28 వేల వరకు పలికిందన్నారు. ప్రస్తుతం టన్ను రూ.22 వేలు ఉందన్నారు. ప్రారంభ ధరతో పోల్చుకుంటే టన్నుకు రూ.6 వేలు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీకి తరలించే కాయలు టన్ను రూ.25 వేల వరకు పలుకుతోందన్నారు. దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేకపోవడం, ధర ఆశాజనకంగా ఉంటే పంట దిగుబడిలేకపోవడం వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ఈ ఏడాది తోటల్లో పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. ఎకరాకు మూడు టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉండగా నేడు టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఈదురుగాలులతో కూడిన వర్షం అడపాదడపా పడుతుండడంతో ఉన్న కాయలు నేలరాలిపోతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ధర పెరుగుతుందని ఆశిస్తున్నట్లు రైతులు తెలిపారు.



మార్కెట్‌లో తోతాపురి కాయలు

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

బంగారుపాళెం: విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లోనూ నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నట్లు ప్రతాప్ వి.రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వందనాత్రిపాఠి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కళాశాల కంటే మెరుగైన వసతులు కళాశాలలో ఉన్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులతో పాటు వృత్తివిద్యా కోర్సులైన ఏఅండ్‌టీ, ఈఈటీ, సెరికల్చర్ గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉందని తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంసెట్, నీట్ వంటి ఉన్నత విద్యకు సంబంధించి ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. 10వ తరగతి పాసైన గ్రామీణ పేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.

50 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు



సమావేశంలో పాల్గొన్న 1974వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో తమ చిన్నతనం గుర్తుకు వస్తుంది. ఆ రోజులే వేరు.. ఆ కాలమే వేరు.. ఎంత బాగుండేదో అనిపిస్తుంది. ఎలాంటి పొరపచ్చాలు, అడ్డుగోడలు, బాధలు లేకుండా స్నేహితులతో కలిసి సరదాగా గడిపే బాల్యం ఎంతో గొప్పది. అలా 50 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో మళ్లీ కలిశారు. చిన్నతనంలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న బడికి వచ్చి అప్పటి గురువులను సన్మానించారు. ఈ సంఘటన ఆదివారం చిత్తూరులోని పీసీఆర్ పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాలకు వారు వస్తున్న క్రమంలో 50 ఏళ్ల ముందు చిత్తూరు ఉన్న పరిస్థితి, ప్రస్తుత మార్పును గుర్తుకు తెచ్చుకున్నారు. అప్పట్లో తెల్లారే లేసి బడికి వస్తున్నప్పుడు రోజువారీ వారి దినచర్యను నెమరు వేసుకున్నారు. అలాగే బడిగంట మోగగానే తరగతి గదిలో వరుస క్రమంలో విద్యార్థులు కూర్చోవడం, ఆ అల్లరి, మాటలు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఏరా ఎలా ఉన్నావు, పిల్లలు ఏమి చేస్తున్నారు. మనవళ్లు ఏమి చదువుతున్నారు, ఆరోగ్యం ఎలా ఉంది అంటూ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. వీరిలో అప్పటి విద్యార్థుల్లో ఒకరైన ప్రస్తుత ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కూడా ఉన్నారు. ఆయన తమ స్నేహితులతో కలిసి పూర్వ ఉపాధ్యాయులతో ముచ్చటించారు. 1974వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనంలో వీరు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన అప్పటి విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. పూర్వ గురువులు కోదండరామ, శోభలతను అప్పటి విద్యార్థులు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, బి.రెడ్డప్ప, శ్రీనివాస్, చంద్రశేఖర్, జ్ఞానశేఖర్, రవీంద్రా రెడ్డి, మునస్వామిలు కలిసి సన్మానించారు.



తమ గురువులతో పూర్వ విద్యార్థులు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పుత్తూరు: అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. తోమాలసేవ, కొలువు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్ట మట్టితో మేదిని పూజ చేపట్టారు. అనంతరం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా శ్రీవిష్వక్సేనుల వారు నాలుగు మాడవీధుల్లో విహరించి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తర్వాత యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు శుద్ధి, ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6.55 గంటల నుంచి 7.25 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రమణ్యస్వామి ఊరేగింపు



స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో ఆదివారం సుబ్రమణ్యస్వామి ఊరేగింపును ఘనంగా చేపట్టారు. దుర్గాలమ్మ ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సుబ్రమణ్యస్వామిని బొమ్మసముద్రం గ్రామంలో ఊరేగించారు.

కనుల పండువగా లక్ష్మీనారాయణ కల్యాణం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతులైన లక్ష్మీనారాయణ స్వామివారికి పట్టువస్త్రాలు పూల హారతులతో అలంకరణ చేసి అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ కల్యాణోత్సవం వైభవం భక్తులు దర్శించుకున్నారు. చిత్తూరులోని సంతపేటకు చెందిన నాగేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పూజలకు విచ్చేసి భక్తులకు ఉభయదారుల నాగేంద్ర దంపతులు ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, ఆలయ అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి పలువురు భక్తులు పాల్గొన్నారు.



ఉభయదారులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మేనేజర్ వెంకటేష్

అలరించిన 'దుర్యోధన వధ'



భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా గానం చేశారు. ఆ తర్వాత దుర్యోధన వధ ఘట్ట ప్రదర్శన భక్తులను అలరించింది. మహాభారతంలో గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీమసేనుడు వెలికి రప్పించి వధించడం విదితమే. ఈ ఘట్టాన్ని కళాకారులు తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. దుర్యోధన పాత్రధారి సత్యరాజ్ తన నటనతో పలువురిని కంటతడి పెట్టించారు. భీమ, దుర్యోధనుల రోషావేశాలతో కలియబడుతూ, పద్యాలు ఆలపిస్తూ, చేసిన యుద్ధం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి, తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్‌నాయుడు, కుప్పయ్య, నారాయణస్వామి నాయుడు, మాధవనాయుడు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.





గుడిపాల: 32 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు, గుడిపాల: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

గుడిపాల: దాదాపు 32 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. స్నేహితుల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సంఘటన గుడిపాల మండలం నరహరిపేట ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ పాఠశాలలో 1991–1992లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. వీరు ఒకచోట కలవాలని నిశ్చయించుకున్నారు. ఒకరికొకరు పోన్ల ద్వారా సమాచారం ఇచ్చుకొని తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.